

'పోలవరం' అక్రమాలకు.. నిప్పుపెట్టారా!?



'పోలవరం' అక్రమాలకు నిప్పుపెట్టారా!? ఆ కార్యాలయం వద్ద పరిస్థితి చూస్తే అవుననే అనిపిస్తుంది..అధికారులు మాత్రం అదేం కాదని కొట్టిపారేస్తున్నారు.. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయం వద్ద కొన్ని పత్రాలను శుక్రవారం దగ్ధం చేశారు. ఆ పత్రాల్లో భూనిర్వాసితుల ఆధార్‌కార్డులు.. ఫొటోలు.. తదితర పత్రాలు ఉన్నాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో కలెక్టర్ ప్రశాంతి శనివారం విచారణకు ఆదేశించారు. అధికారులు రంగంలోకి దిగారు.. ఈ లోపునే తగలబెట్టిన పత్రాలను సిబ్బంది అక్కడి నుంచి తరలించేయడం గమనార్హం. పనికిరానివైతే ఎందుకు తరలించారనేది ప్రశ్నార్థకం..? - వివరాలు మెయిన్‌లో

తగలబెట్టిన పోలవరం భూనిర్వాసితుల పత్రాలు...

పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



కొవ్వూరులో ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్య సిబ్బంది నినాదాలు

వైద్యం అందక.. విలవిల

కోల్‌కతా ఘటనకు నిరసన.. సేవలు బంద్



ఓపీ సేవలు నిలిపివేయడంతో ఖాళీగా ఉన్న జీజీహెచ్ ఆసుపత్రి ఆవరణ

- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు మూత
- ఐఎంఏ పిలుపుమేరకు నిలిచిపోయిన సేవలు
- సమాచారం అందక క్యూకట్టిన రోగులు
- వైద్యం అందించమని వేడుకోలు
- ఎక్కడికక్కడ వైద్యుల నిరసన ప్రదర్శనలు
- అత్యవసర వైద్య సేవలందినట్టు సమాచారం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17 : వైద్యం బంద్ కావడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. సేవలందక ఆపసోపాలు పడ్డారు.. కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ ఐఎంఏ పిలుపుమేరకు శనివారం వైద్య సేవలు నిలిపివేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి), జిల్లా వ్యాప్తంగా సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ఓపీ సేవలను నిలిపివేయడంతో రోగులు వైద్య అందక విలవిల్లాడిపోయారు. ఎక్కడెక్కడి నుంచో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చినా వైద్యం అందలేదు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో వందలాది ఆసుపత్రులు ఉంటాయి. ఆసుపత్రులకు ప్రతి రోజూ వేలాదిగా రోగులు, బంధువులు వస్తుంటారు. అయితే ఆయా ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలను నిలిపివేయడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడారు. వైద్య సేవలు నిలిపివేయడంతో నిరాశగా వెనుతిరిగారు. చాలా ఆసుపత్రుల వద్ద రోగులు చాలా దూరం నుంచి వచ్చాం.. డాక్టర్‌గారిని చూడమనండి.. మళ్లీ రావాలంటే చాలా కష్టం అంటూ ఆసుపత్రి సిబ్బందిని బ్రతిమలాడుకోవడం కనిపించింది. అయితే ఆసుపత్రి సిబ్బంది ఏ మాత్రం కనికరించలేదు. ఇక జీజీహెచ్ నర్సింగ్ స్టాఫ్, ఇతర వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆసుపత్రిలో పనివేళల్లో తమకు భద్రత కల్పించాలని, మృతి చెందిన జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఐఎంఏ పిలుపుతో వైద్యులు చాలా మంది అందుబాటులో లేకుండా పోయారు. అత్యవసర ఓపీ సేవలు మాత్రమే కొనసాగించారు. సాధారణ ఓపీ లేక దూరప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన రోగులు నానా ఇబ్బందులు పడ్డారు.మరోపక్క ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సైతం నిరసనకు పిలుపు ఇవ్వడంతో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు సైతం ఓపీ వైద్యసేవలను బంద్ చేశారు. దీంతో దూరప్రాంతాల నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్జరీలు కూడా చేయలేదు. ఐఎంఏ వారు రామాలయం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఆసుపత్రి సేవలు అత్యవసర సర్వీసులుగా పరిగణిస్తారు. ఏదైనా నిరసన తెలియజేయాలంటే ముందస్తు ప్రచారం, సమాచారం ప్రజలకు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఐఎంఏ దీన్ని పట్టించుకోకుండా తక్కువ సమయంలోనే నిరసనకు పిలుపునివ్వడంతో చాలా మందికి సమాచారం చేరలేదు. విషయం తెలియకపోవడంతో ఎక్కడెక్కడి నుంచో ఆసుపత్రులకు వచ్చిన రోగులకు అగచాట్లు తప్పలేదు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ప్రతిరోజూ సుమారు రెండు, మూడు వందల మంది సాధారణ ఓపీకి వస్తుంటారు. శనివారం కావడంతో ఈ సంఖ్య కాస్త తక్కువగానే ఉన్నా వచ్చిన వారంతా అనేక వ్యయప్రయాసలతో రావడంతో ఇబ్బందులు తప్పలేదు. ఆదివారం ఎలాగూ ఓపీ ఉండదు. వైద్యానికి సోమవారం వరకూ వేచి ఉండాల్సి ఉంటుంది. అలాగే, ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఓపీ ఎక్కువగానే ఉంటుంది. ఒక్కో ఆసుపత్రిలో ఎంతలేదన్నా ఐదారు వందల మంది ఓపీకి వస్తుంటారు. అయితే శనివారం మాత్రం వైద్యుల నిరసన కారణంగా ప్రజలకు తిప్పలు తప్పలేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలు బంద్ చేయ డంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా జూనియర్ డాక్టర్‌ను హత్య చేయడం అమానవీయమని రాజమహేంద్రవరం జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కందుకూరి శ్యామ్‌కుమార్, సరాకుల సుధాకర్ పేర్కొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిరసన

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 17: కోల్‌కతాలో వైద్యవిద్యార్థిపై జరిగిన పాశవిక దాడికి నిరసనగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన సంఘటన కలచివేసిందన్నారు. వైద్యులకు భద్రత అవసరమని అన్నారు. జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల సంఘం డాక్టర్ మౌనిక మాట్లాడుతూ హత్యకు గురైన వైద్యురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైద్యులను గౌరవించడం భద్రత కల్పించి కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు.ఆరోగ్యవంతమైన సమాజం కోసం అహర్నిశలు పాటుపడే వైద్యులపై ఇటువంటి దాడులకు పాల్పడడం విచారకరమని ఇటువంటివాటిని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ షమ్మీకుమార్ , డేమో సత్య కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది నిరసన

జాంపేట అర్బన్ బ్యాంక్ బరిలో 26 మంది



నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న జగన్నాథరెడ్డి

రాజమహేంద్రవరం,ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి) : జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల స్క్రూటీనీలో నాలుగు నామి నేషన్లు వివిధ కారణాల వల్ల తిరస్కరించినట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్, జాంపేట బ్యాంక్ ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి శనివారం రాత్రి తెలిపారు. 12 డైరెక్టర్ల పదవులకు మొత్తం 37 నామినేషన్లు దాఖలు చేశారు.వీటిలో నాలుగు స్క్రూటీనీలో పోగా, ఏడు రెండేసి సెట్లు రావడంతో ఒక్కొక్కటి తొలగించామన్నారు. మొదటి నియోజక వ ర్గం 21, రెండో నియోజకవర్గంలో 2, మూ డో నియోజకవర్గంలో 3 నామినేషన్లు అనుమతించినట్టు తెలిపారు.ఆదివారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆ తరువాత ఎన్నికల్లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసు

ఘంటావారిగూడెంలో ఘటన.. ఆరుగురిపై కేసు నమోదు

నల్లజర్ల,ఆగస్టు 17 : నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో ఉన్న రాజేశ్వరి ఫాం హౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, నల్లజర్ల సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గుణ్ణం సురేష్ తన పుట్టిన రోజు వేడుకను శుక్రవారం రాత్రి ఫాంహౌస్‌లో ఘంటా యువరాజు సహాయంతో ఏర్పాటు చేశాడు. బంధుమిత్రులకు విందుతో పాటు వినోదం కల్పించేందుకు కిలపర్తి దుర్గా శ్రీనివాస్ అనే మధ్యవర్తి ద్వారా నలుగురు యువతలను తీసుకుని వచ్చి సినిమా పాటలకు డ్యాన్స్ వేయించాడు.ఆ ఫంక్షన్ హాజరైన కొందరు వీడియో తీసి గ్రూపుల్లో పెట్టడంతో శనివారం వైరల్ అయ్యింది. విచారణ చేపట్టగా నిర్వాహకులు గుణ్ణం సురేష్,ఘంటా యువరాజులపై చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్టు గుర్తించారు.ఈ మేరకు నల్లజర్ల సీఐ, దేవరపల్లి ఎస్ఐ తక్షణమే స్పందించి తమ సిబ్బందితో వెళ్లి సురేశ్, యువ రాజు, శ్రీనివాస్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. డ్యాన్సర్లను మండపేటకు చెందిన వారని తెలిపారు.

నల్లజర్లలో జరిగింది రేవ్ పార్టీ కాదు : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రేవ్ పార్టీ జరిగిందని,పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వస్తున్న వార్తలు అవాస్తవాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. వదంతులను సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా వ్యాప్తి చేస్తే కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులపై ఇప్పటికే ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. సాధారణ జనజీవనానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడం నేరమన్నారు. ఇటువంటి ఘటనలపై సమాచారమివ్వాలన్నారు.

పౌర హక్కుల సేవా రోజుగా నాలుగో శనివారం : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 15 : మండల స్థాయిలో ప్రతి నెల నాలుగో శనివారం పౌరహక్కుల సేవా రోజు నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సమీకృత కుల ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్సీ కార్డులు, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఎస్ఎస్ఆర్-2025 ఓటర్ల జాబితా తదితర అంశాలపై కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చిన అర్జీలను సోమవారం నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 187 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రానున్న నెల రోజుల్లో ఎస్సీ ఎస్టీ కమిషన్ జిల్లా పర్యటన నేపథ్యంలో కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 28 నుంచి బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేపట్టి ఓటరు జాబితా సవరణ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్షా నాలుగు వేల 622 మంది రైతుల సీసీఆర్సీ నమోదు చేశామన్నారు. రాజమహేంద్రవరం 546, కోరుకొండ 472, బిక్కవోలు 427 మంది రైతులు వివరాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.జిల్లాలో సాగుకింద రాని సుమారు 15 వేల హెక్టార్ల విస్తీర్ణం ఉందన్నారు.సమావేశంలో జేసీ చినరాముడు,డీఆర్‌వో జి.నరసింహులు, ఏవో పాపారావు పాల్గొన్నారు.

కొవ్వూరు సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ బదిలీ



రాజమహేంద్రవరం,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ బదిలీ అయ్యారు. ఆయనను పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది.కొవ్వూరుకు ఎవరినీ నియమించలేదు. ఐఏఎస్ ఆఫీస రైన శ్రీవాత్సవ ఎన్నికల ముందు కొవ్వూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్య తలు స్వీకరించారు.ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా వ్యవ హరించి మంచి పేరుతెచ్చుకున్నారు.

అమ్మో.. జ్వరం

గోకవరం మండలంలో వణుకుతున్న జనం



రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త.

చినుకు పడితే చింతే..

డ్రైనేజీ లేక ఇళ్ల మధ్యనే నిలిచిన మురుగు

గోకవరం, ఆగస్టు 17 : గోకవరం మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి..ఏ గ్రామంలో చూసినా జనం జ్వరంతో వణికిపోతున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. జ్వరపీడితులను గుర్తించి ప్రభుత్వాసుపత్రులకు పంపుతున్నారు.అయితే ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.దీంతో ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, టైఫాయిడ్ తదితర కేసులు నమోదవుతున్నట్టు ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు. డెంగీ వచ్చి న రోగులు ప్లేట్ లెట్స్ పడిపోవడంతో ప్రాణపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.మరో వైపు టైఫాయిడ్ జ్వరపీడితులు ఉంటున్నారు. కొంతమంది రోగులు ఆర్ఎంపీలను ఆశ్రయించి వైద్యం చేయించుకుంటున్నారు. మండలంలో ఎక్కువగా మల్లవరం,గోకవరం, తంటికొండ, కృష్ణునిపాలెం, వెదురుపాక, ఇటికాయిలపల్లి, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో జ్వరపీడితులు ఉన్నారు. ఏ ఇంటి తలుపు తట్టినా ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారనే సమాధానమే వినిపిస్తుంది. ఇదిలా ఉంటే మండలంలో ఎక్కడా డెంగీ జ్వర పీడితులు లేరని..డెంగీకి సంబంధించి వైద్య పరీక్షలు ప్రభుత్వాసుపత్రుల్లో చేయించుకుంటేనే సరైన స్పష్టత వస్తుందని ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. డెంగీ జ్వరాలు లేకపోతే ప్లేట్‌లెట్స్ ఎందుకు తగ్గుతాయంటూ పలువురు రోగులు ప్రభుత్వ వైద్యులను ప్రశ్నిస్తు న్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు ఒక పక్క.. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ము రుగు నీరు నీరు నిల్వ ఉండడం, అపారిశుధ్యం, తాగు నీరు కలుషితం కావడం తదితర కారణా లతో జ్వరాలు ప్రబలుతున్నాయి. మండలంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. రక్షిత నీటి పథకాల ట్యాంకుల శుభ్రత మొదలు, చెత్త, తొలగింపు వరకు నిర్లక్ష్యం రాజ్యమేలుతుంది. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా, ఆచరణలో మా త్రం అంతగా ప్రయోజనం కని పించడంలేదు. ఇటీవల కురుస్తున్న వర్షా లకు రోడ్లు బురదమయంగా మారగా, డ్రైనేజీ సిల్ట్‌తో నిండిపోయింది. గ్రామాల్లో రహదారులు, జనంతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు చెత్తకుప్పలతో నిండి డంపింగ్ యా ర్డులను తలపిస్తున్నాయి. పలుచోట్ల మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వదజల్లుతుంది. 15 రోజులకోసారి మంచినీటి ట్యాంకులను శుభ్ర పరిచి క్లోరినేషన్ చేయాల్సిన పద్ధతులు ఎక్కడా కానరావడంలేదు.



ఆకాశంలో అపురూపాలు!

ఆకాశమంటేనే అద్భుతం. నింగి వైపు చూసిన ప్రతిసారీ సరికొత్తగా కనిపిస్తుంటుంది. ఒక్క హరివిల్లు కనిపించినప్పుడు అదిగో సప్త వర్ణ శోభితమని మురిసిపోతుంటాం కానీ, ఈ చిత్రాలు చూశాక ప్రతి రోజూ, ప్రతి రేయి అపురూపమే అనుకోకుండా ఉండలేం. మొదటి చిత్రం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా మండపేట పట్టణంలో నీలాకాశంలో తెలుపు నలుపు సోయగాలు.. రెండోది.. అదే పట్టణంలో రాత్రి విద్యుత్ వెలుగుల మధ్య నుంచి అచ్చమైన నీలాకాశం.. మూడోది.. ఆకాశంలో మేఘాలు రెండు నీటి గుర్రాల ఆకృతిలో కనువిందు చేసిన దృశ్యం. ఒక నిమిషంపాటు ఉన్న ఈ దృశ్యం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గోదావరి తీరంలోనిది. - మండపేట/పెరవలి

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



పెద్దాపురం, ఆగస్టు 17: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,65,620, అన్నదాన విరాళాలు రూ.64,874 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.9,560, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా 18,510, కానుకల ద్వారా రూ.9 వేలు, వెరసి రూ.2,68,114 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నాలుగేళ్లలో..ఆ రెండు చిత్రాలే..



డైరెక్టర్ సందీప్ వంగా

తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలోని సుకృత ఆడిటోరియంలో జీఎస్ఎల్ విద్యా సంస్థల మాతృ సంస్థ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అర్జున్‌రెడ్డి, యానిమల్ సినిమాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

ప్రశ్న : మీరు చేసిన సినిమాల్లో వైద్య రంగానికి సంబంధించి ఉన్నాయి, దీనికి ప్రత్యేక కారణాలు?

సందీప్‌రెడ్డి : స్వతహాగా ఫిజియోథెరపిస్టుని కావడం వల్ల వైద్యంపై ఉన్న పరిజ్ఞానం సినిమాల్లో ప్రతిబింబింపజేసింది తప్ప ప్రత్యేకత ఏమీలేదు.

ప్రశ్న: ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీస్ చేస్తున్న మీరు సినిమాల వైపు ఎందుకెళ్లారు ?

సందీప్‌రెడ్డి: విద్యార్థి దశ నుంచి సినిమాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీస్‌లో ఉన్నప్పటికీ సినిమా రంగం వైపు మక్కువతో వెళ్లడం జరిగింది.

ప్రశ్న : మీరు చేసే తదుపరి సినిమాలేంటి?

సందీప్‌రెడ్డి : త్వరలో ప్రభాస్ హీరోగా స్పిరిట్ ప్రారంభమవుతుంది.

ప్రశ్న : మహేష్ బాబుతో ఒక సినిమా తీస్తానన్నారు, అదెప్పుడు?

సందీప్‌రెడ్డి : మహేష్‌బాబుతో ఒక సినిమా చేయాలనుకున్న మాట వాస్తవమే, కానీ ప్రస్తుతం స్పిరిట్ ప్రారంభించాలి. ఆ తర్వాత యానిమల్ పార్ట్-2 తీయాలి, ఈ రెండు ప్రాజెక్టు పూర్తయ్యే సరికి 3 నుంచి 4 సంవత్సరాలు సమయం పడుతుంది. ఆ తర్వాతనే ఏదైనా..

ప్రశ్న : విద్యార్థులకు మీరిచ్చే సందేశం?

సందీప్‌రెడ్డి : సినిమాల ద్వారానే నా సందేశం ఏమిటో చెబుతుంటాను, వాటిలో ఉన్న మంచిని స్వీకరించి, చెడును అక్కడనే వదిలేయాలి. - రాజానగరం

మనం చేసే పనిలో దృష్టి సారిస్తే విజయాలు సొంతం

» ప్రముఖ సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా » ఘనంగా జీఎస్ఎల్-స్వతంత్ర ఇనిస్టిట్యూషన్స్ 38వ వార్షిక వేడుకలు





వార్షికోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సందీప్‌రెడ్డి, పక్కన సందీప్‌రెడ్డికి సత్కారం

రాజానగరం, ఆగస్టు17: ఏ వృత్తిలో అయినా తాము చేసే పనిలో దృష్టిసారిస్తే విజయాలు సొంతమవుతాయని యానిమల్ సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన జీఎస్ఎల్-స్వతంత్ర ఇనిస్టిట్యూషన్స్ 38వ వార్షిక వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్‌రెడ్డి మాట్లాడుతూ చేసే పనిపై దృష్టి కేంద్రీకరిస్తే విజయం చేకూరుతుందన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన అధునాతన సౌకర్యాలను ఎక్కడా చూడలేదన్నారు. అక్కడికి వెళ్లి చదువుకోవాలనిపించే అతికొద్ది సంస్థల్లో జీఎస్ఎల్ ఒకటిగా నిలుస్తుందన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన స్మార్ట్ ల్యాబ్‌తోపాటు లైబ్రరీ తదితర విభాగాలను పరిశీలించిన డైరెక్టర్ సంతోషం వ్యక్తంచేశారు. మరో ముఖ్య అతిథి రాజా నగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జీఎస్ఎల్ సంస్థల మూలంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, భవిష్యత్తులో జీఎస్ఎల్ సంస్థ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సినీ డైరెక్టర్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ గన్ని సందీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గన్ని సాధిక, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్ పాల్గొన్నారు.



అమ్మ ఇడ్లీ పథకాన్ని ప్రారంభిస్తున్న దర్శకుడు సందీప్‌రెడ్డి

స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే అమ్మ ఇడ్లీ

ప్రారంభించిన సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17: రాజమహేంద్రవరం జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే మూడు ఇడ్లీలు అందజేయడం పేషెంట్లకు, వారి సహాయకులకు ఎంతో ఉపకరమని సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేన్సర్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు పండ్లు పంచారు. కాగా కేవలం ఐదు రూపాయలకే మూడు ఇడ్లీలు, ఒక చట్నీ ఇస్తారని మేనేజర్ రామకృష్ణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన సోదరుడు, జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సర్జరీ అనంతరం చంటిబిడ్డ

రోజుల బిడ్డకు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స

పుట్టుకతోనే ఉదర భాగంలో చర్మంలేని వైనం.. విజయవంతమైన ఇలియాస్టమీ సర్జరీ

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 17: నెలలు నిండకుండానే జన్మించిన రోజుల చంటిబిడ్డకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స చేసి పునర్జన్మను అందించారు. ఆ బిడ్డను హెన్ (హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్) స్టేట్ ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎన్ మూర్తి శనివారం పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం తీగలమెట్ట గ్రామానికి చెందిన గిరిజన మహిళ జోనంగి జానకి నెలలు నిండకుండానే స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 15న మగశిశువుకు జన్మనిచ్చింది. కాగా శిశువు ఉదర భాగంపై చర్మం ఏర్పడకపోవడంతో పేగులు బయటకు వచ్చి శిశువు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లాడు. దీంతో అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. ఆ సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు రాగా పిడియాట్రిక్ సర్జరీ వైద్య బృందం శిశువుకు ఇలియాస్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జీజీహెచ్‌లోని గిరిజన నిరీక్షణ కేంద్రంలో ఉన్న తల్లి జానకిని, డీఎన్ మూర్తి పరామర్శించి చంటిబిడ్డకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమెను బాలింతల సంరక్షణ వార్డులో చేర్పేందుకు ఆదేశాలు జారీచేశారు.

కూటమి ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు నిదర్శనమిది

48 గంటల్లో ఇద్దరు బాలికల ఆచూకీ కనుగొన్నారు..

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఆగస్టు 17: కిడ్నాప్‌కు గురైన ఇద్దరు బాలికల ఆచూకీ 48 గంటల్లో కనుగొనేలా తూర్పుగోదావరి జిల్లా పోలీసులు వ్యవహరించిన తీరు అభినందనీయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు ఇది నిదర్శనమని చెప్పారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మను తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన మహిళ సునీత కలుసుకుని, తన ఇద్దరు కుమార్తెల ఆచూకీ కనుగొనేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సునీత తన ఇద్దరు కుమార్తెలను మారోజు వెంకటేష్ అనే వ్యక్తిపై తనకు అనుమానాలు ఉన్నట్టు తెలియజేశారని చెప్పారు. దీంతో తాను మంత్రి లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతోపాటు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీతో మాట్లాడానని తెలిపారు. తాను ఎస్పీతో మాట్లాడిన 48 గంటల్లోనే ఇద్దరు బాలికలను తల్లి చెంతకు చేర్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. ఇందుకు కృషి చేసిన మంత్రి లోకేష్‌కు, తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, బస్వా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో అవకాశం

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ 2023, 2024లో పూర్తిచేసి 75% మార్కులు సాధించిన నాన్-మ్యాథ్స్ గ్రూపు విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్ రోల్స్‌లో అవకాశం కల్పిస్తున్నారని ఇంటర్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (జోన్ 1,2) ఐ.శారద తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆసక్తి కలిగిన సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, వొకేషనల్ విద్యార్థులు ఈనెల 20న ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో హెచ్‌సీఎల్ నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని ఆమె చెప్పారు. https://bit.ly/tecbeeGoAP లింక్ ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96429 73350 నెంబరు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని ఆర్ఐవో నరశింహం తెలిపారు. కాబట్టి అన్ని యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అర్హత కలిగిన వారందరూ పరీక్షకు హాజరయ్యేట్టు చూడాలని సూచించారు.





గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 5.47 లక్షలతో నిర్మించిన సంపద తయారీ కేంద్రం (ఫైల్).. విచారణ చేపట్టాలని కార్యదర్శిని ఆదేశిస్తున్న నల్లమిల్లి

చెత్త నుంచి సంపద కేంద్రం మాయం చేశారు

» 32 కొబ్బరి చెట్లూ కొట్టేశారు » పోలీసులకు ఫిర్యాదు చేసిన మహేంద్రవాడ కార్యదర్శి » విచారణ చేపట్టాలన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 17: అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలోని తూర్పు పుంతరోడ్డులో చెట్టుపట్టా పథకం కింద కేటాయించిన భూమిలో కొబ్బరి చెట్లు నరికివేత వివాదాస్పదంగా మారింది. ఈ భూమిలో ఉన్న 32 కొబ్బరి చెట్లను నరికివేయడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి జి పద్మావతి శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కార్యదర్శి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో తూర్పు పుంతరోడ్డులో ఎకరం భూమిని మేడపాటి పెదకాపు అనే కామిరెడ్డికి ప్రభుత్వం చెట్టూ పట్టా పథకం కింద 77 సంవత్సరాల లీజుకు ఇచ్చారు. అయితే పట్టాదారుకు చెందిన కుటుంబీకులు గ్రామంలో ఎవరూ ఉండకపోవడంతో అప్పటి నుంచి చెట్లు నిరుపయోగంగా ఉండడంతో పంచాయతీ వాటిని సంరక్షిస్తూ వచ్చింది. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్మాణానికి ఈ భూమిని అధికారులు గుర్తించడంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5.47లక్షలతో నిర్మాణం చేపట్టారు. కొద్దికాలం దీన్ని వినియోగించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో సంపద కేంద్రాన్ని కూలగొట్టి కొందరు స్థలానికి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కేంద్రాన్ని మాత్రం పూర్తిగా తొలగించడంతో తిరిగి ఖాళీ స్థలంగా మారింది. గత రెండు రోజుల కిందట ఇదే స్థలంలో ఉన్న 32 కొబ్బరి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి అదే స్థలంలో వదిలిపెట్టి పోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో ఆమె అక్కడికి వచ్చి విచారణ చేపట్టి చెట్లను కొప్పవరం గ్రామానికి చెందిన వ్యక్తులు నరికినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని నరికిన చెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. చెట్లు నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కార్యదర్శి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, ఆగస్టు 17: రైలు ఢీకొని మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని రైల్వే పెద్ద గేటు సమీపంలో విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు కిందపడి 19 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. రైల్వే ఎస్ఐ అబ్దుల్‌మారుఫ్ తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు వి.భానుపద్మేశ్వరరావు (19)తుని మండలం ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. మృతుడు చనిపోదామని ఉద్దేశంతోనే రైలు కింద తల పెట్టినట్టు తెలుస్తోందని ఆయన చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి శవ పంచనామాలు అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

నందంపూడి వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

అంబాజీపేట, ఆగస్టు17: సహచర మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సస్పెండ్‌చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాంజీ అదే సచివాలయంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల ఈనెల ఒకటో తేదీన అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ యువతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో రాంజీని సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

చెక్‌పోస్ట్‌ల్లో 24 గంటలూ తనిఖీలు

కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం రవాణాపై ఉక్కుపాదం

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 17: కాకినాడ పోర్టులో ఉన్న రెండు చెక్‌పోస్ట్‌ల్లో 24 గంటలూ తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టులో బొంబాయి కాటా వద్ద ఉన్న చెక్‌పోస్ట్, శక్తిగ్యాస్ సమీపంలో ఉన్న అవుట్‌గేట్ వద్ద చెక్‌పోస్ట్‌ల్లో 24 గంటలూ బియ్యం లారీల తనిఖీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ ఒక్కొక్క చెక్‌పోస్ట్ వద్ద ఒక డిప్యూటీ తహశీల్దార్‌తోపాటు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇద్దర టెక్నికల్ అసిస్టెంట్లు, వీఆర్‌వో, పోలీసులు 24 గంటలూ మూడు షిప్ట్‌ల్లో పనిచేస్తారన్నారు. కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం ఎగుమతి కాకుండా ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ప్రతి లారీను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోర్టులోకి అనుమతిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎగుమతిదారులు, హమాలీ అసోయేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు రోజూ వెయ్యి వాహనాలు వస్తున్నాయని, వాటిని సకాలంలో తనిఖీ చేయాలన్నారు. రోజుకు ఆరేడు ట్రిప్‌లు తిరిగే లారీలు చెక్‌పోస్ట్ వద్ద జాప్యం కారణంగా కేవలం మూడు ట్రిప్‌లు తిరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ జోక్యం చేసుకుని వేగంగా తనిఖీలు చేయాలనే ఉద్దేశంతో తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, సివిల్ సప్లయిస్ డీఎం బాల సరస్వతి, కాకినాడ ఆర్డీవో కిషోర్, ఎగుమతిదారులు, హమాలీల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలోని పలువురు అధికారులకు అంతర్గత బదిలీలు

జేఎన్టీయూకే, ఆగస్టు 17: జేఎన్టీయూకేలో పరిపాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పలువురు అధికారులను అంతర్గత బదిలీలుచేస్తూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబును జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులు లేని విద్యార్థులను దత్తత తీసుకుని వారి బాగోగులను చూసేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన కల్చర్, ఆర్ఫన్ అవుట్‌రీచ్ డైరెక్టరేట్‌కు ఇన్‌ఛార్జి డైరెక్టరుగా బదిలీచేశారు. యూవీ రత్నకుమారిని ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్ ఇన్‌ఛార్జి డైరెక్టరుగానూ, ప్రొఫెసర్ ఎం.నాగేశ్వరరావును వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(యూజీ) గానూ, ఎం.స్వరూపారాణిని అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్‌గానూ, ప్రొఫెసర్ జీవీఎస్ఆర్ దీక్షితులను యూసీఈకే అకడమిక్స్ విభాగం ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్‌గానూ నియమించారు. అదేవిధంగా కె.వెంకటరెడ్డిని ఈఈఈ విభాగాధిపతిగానూ, ఎన్.రామకృష్ణయ్యను సీఎస్ఈ విభాగాధిపతిగానూ, ఎం.శైలజను ఈసీఈ విభాగం ప్రొఫెసర్‌గానూ, ఎం.కుమారస్వామిని మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ, డాక్టర్ ఉషాదేవిని ఏసీఈగానూ బదిలీచేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన అధికారులను ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ అభినందించారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

కాకినాడ రూరల్, ఆగస్టు 17: కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు, ఏపీఆర్ఈఐఎస్, ఏపీఎస్ఈఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీఎంఎస్ అన్ని ఇతర యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ కనీసం 15 ఏళ్ల బోధనానుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జిల్లా స్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. deoeg.org వెబ్‌సైట్‌లో ఉదహరించిన నియమ నిబంధనలననుసరించి అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చెక్‌లిస్ట్‌ను పూరించి ఈనెల 28 లోపు సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అప్పనపల్లిలో శనివారం బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, ఆగస్టు 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం 3,671మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 2,948 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,17,707 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి నిత్యాన్నదాన పథకానికి పాశర్లపూడి బాడవకు చెందిన కాండ్రేగుల వెంకటేశ్వరరావు, సూర్యావతి దంపతులు రూ.11,111 విరాళం అందించారు.

కోరుకొండ సరస్వతీ విద్యా నికేతన్‌కి అనుమతుల్లేవు: ఆర్ఐవో

కోరుకొండ/రాజమహేంద్రవరం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కోరుకొండలోని సరస్వతి విద్యానికేతన్ జూనియర్ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులులేవని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. అందువల్ల ప్రవేశాలు పొందిన విద్యార్థులను బోర్డు, కళాశాల లాగిన్‌లోకి అనుమతించడం జరగదన్నారు. దీంతో వారికి ఎట్టి పరిస్థితుల్లో నూ పబ్లిక్ పరీక్షలు రాసే అవకాశం ఉండదన్నారు. ఆ కళాశాలలో తమ పిల్లలను చేర్చవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనుమతులు లేకుండా కళాశాల నిర్వహించడంపై ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఏజెన్సీ సమాచారం

బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత అందరిదీ

● సబ్‌కలెక్టరు ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఆగస్టు 17: ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సబ్‌కలెక్టరు, బాల్య వివాహాల నిర్మూలన నోడల్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన బాల్య వివాహాల నిర్మూలన డివిజన్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లోని గ్రామ, కులపెద్దలకు బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనపై పోలీస్‌శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి, సీఐ ఆర్.జె.రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుసుమకుమారి, ప్రకాష్‌కుమారి, రాఘవ, అమ్మాజీ, రామలక్ష్మి, సచివాలయ మహిళా పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా ఎస్ఎంసీ ఎన్నికలు

రాజవొమ్మంగి ఆగస్టు 17: మండలంలో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. మండల వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినా, రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రం ఎన్నిక ఉత్కంఠ భరితంగా సాగింది. రాజవొమ్మంగి హైస్కూల్‌లో ఎస్ఎంసీ ఛైర్మన్‌గా పోటీపడే ఇద్దరు అభ్యర్థులకు కూటమి పార్టీ నాయకుల మద్దతు ఉండడంతో ఎన్నిక చివరి వరకు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ విషయాన్ని ముందుగానే గ్రహించిన పాఠశాల యాజమన్యం తమకు బందోబస్తు కావాలంటూ పోలీసు,రెవెన్యూ శాఖలకు ముందుగానే సమాచారం అందించారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో ఉదయం 7గంటల నుంచే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎన్నికల ప్రక్రియను తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు దగ్గరుండి పర్యవేక్షించారు. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన మరిచర్ల శ్రీనివాస్ జిల్లా పరిషత్ పాఠశాల ఛైర్మన్‌గా, మిరియాల వెంకటరమణ అనే మహిళ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఛైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌ను టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జడ్పీటీసీ వడుగుల జ్యోతి అభినందించి సన్మానించారు.

ముగిసిన స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు

ఎటపాక ఆగస్టు 17: స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు శనివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మొత్తం మండలంలో 91 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. 4 ప్రాథమిక పాఠశాలల్లో కమిటీ ఎన్నికకు కోరం ఎన్నికను సోమవారంనకు వాయిదావేశారు. ఇందులో 9 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 81 ప్రాథమిక పాఠశాలలకు కమిటీలను ఎన్నుకున్నారు. ప్రతీ పాఠశాలలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

దేవీపట్నం: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలు శనివారం జరిగింది. ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం, దేవారం, పాముగండి, చొప్పకొండ తదితర గ్రామాల్లో హెచ్ఎంల ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా ఎన్నికైన ఛైర్మన్లు, సభ్యులను కూటమి నాయకులు అభినందించారు. రెండు, మూడుచోట్ల వివాదాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

వై.రామవరం: మండలంలో 108 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు. మండల ఎగువ, దిగువ ప్రాంతాల్లో జీపీఎస్, ఎంపీపీ, జడ్పీహెచ్ఎస్, ఆశ్రమ పాఠశాలల్లో ఎన్నికలు పూర్తిచేసినట్లు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు, సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని ఎంఈవో తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

ఎటపాక, ఆగస్టు17: ఎటపాక మండలం, గన్నేరుకొయ్యపాడు గ్రామంలో దొంగలు రైతుల ట్రాక్టర్ల బ్యాటరీని చోరీ చేశారు. రైతులు ఆకుల వెంకటరామారావు, మోగిలి వెంకన్న ట్రాక్టర్లను రోజుమాదిరిగానే గ్రామ శివారులోని పందిరిపాక కింద ఉంచారు. అర్ధరాత్రి దొంగలు ఆకుల వెంకటరామారావుకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీ బోల్ట్‌లను ఇప్పి, ఎత్తుకెళ్లారు. కాగా పక్కనే ఉన్న మరో ట్రాక్టర్‌బ్యాటరీకి విఫలయత్నం చేశారు. ఆ బ్యాటరీ బోల్ట్ రాకపోవడంతో చోరీకి వీలుపడలేదు.

పోతుకొండ రేవు కాలువకు బ్రిడ్జి నిర్మించాలి

దేవీపట్నం, ఆగస్టు 17: మండలంలోని ఇందుకూరుపేట పంచాయతీ పరిధిలో పోతుకొండ గ్రామంలో ఉన్న నీలాటి రేవు కాలువకు బ్రిడ్జి నిర్మించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్‌ఛైర్మన్ తెల్లం శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రేవు కాలువకు బ్రిడ్జి నిర్మించకపోవడంవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కమలంపాలెం జంక్షన్ నుంచి పోతుకొండ మీదుగా దేవారం, పోతవరం వరకు తారు రోడ్లు నిర్మించాలని కోరారు.

ట్రాక్టర్ కింద పడి గిరిజనుడి దుర్మరణం

కూనవరం, ఆగస్టు 17: ట్రాక్టర్ క్రిందద పడి ఓ గిరిజనుడు దుర్మరణం పాలయ్యాడు. కూనవరం మండలంలోని గండికొత్తగూడెంనకు చెందిన కట్టం సతీష్(33) ట్రాక్టర్‌తో పొలంలో దమ్ము చేస్తుండగా ప్రమాదవశాత్తూ దమ్ము చక్రాల కింద పడి మృతి చెందాడు. సతీష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, పి.రామారావు, టి.తమ్మయ్య, యు.కన్నయ్య, టి.బుచ్చిరాజు కోరారు.

మూడు నెలలు అంధకారం వీడింది

చింతూరు, ఆగస్టు17: డివిజన్ కేంద్రమైన చింతూరు సెంటర్‌లో మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చింతూరు సెంటర్ మూడు నెలలపాటు అంధకారంలో మగ్గింది. విషయం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య దృష్టికి వెళ్లింది. స్పందిన పీవో వీధి దీపాలు వెలిగేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్‌తో పాటు సిబ్బంది రమణ లక్ష్మణ్‌విజయ్‌లు రంగంలోకి దిగారు. వివిధ ప్రదేశాల్లో మరమ్మత్తులు చేపట్టి కొత్త కేబుల్ లైన్ వేశారు. దీంతో శనివారం వీధి దీపాలు వెలిగాయి.



అనపర్తిలో నిరసన తెలుపుతున్న వైద్యులు



చింతూరు ఐటీడీఏ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



రంపచోడవరంలో అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

వైద్యురాలిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

● కలకత్తా సంఘటనకు నిరసనగా వైద్యుల భారీ ర్యాలీ

అనపర్తి, ఆగస్టు 17: కోల్‌కత్తాలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను బహిరంగంగా శిక్షించాలని ఐఎంఏ అనపర్తిశాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగుర్రెడ్డి డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యకు నిరసనగా శనివారం ఉదయం నుంచి అనపర్తిలో వైద్యులు అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా అనపర్తి ఏరియా ఆసుపత్రి నుంచి వైద్యులు భారీ ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నిరంతరం పాటుపడే వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ అనపర్తి శాఖ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సిబ్బందితో కలిసి ఏరియా ఆసుపత్రి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గాంధీ విగ్రహంవద్దకు చేరుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్, కర్రి సునీల్‌కుమార్‌రెడ్డి, భాందవి, తేతలి సత్యనారాయణరెడ్డి, తేతలి వెంకట్రామిరెడ్డి సంధ్యారెడ్డి, కర్రి వెంకటసాయికృష్ణారెడ్డి, పులగం రామానంద సాగర్, ఏఎస్ ఎన్ మూర్తి, రమాదేవి, వరలక్ష్మి, ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించండి

గోకవరం: కోల్‌కతా ఆసుపత్రిలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ గోకవరంలో శనివారం ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఆసుపత్రి నుంచి ర్యాలీగా బయలుదేరి రాణా సెంటర్‌కు చేరుకొని అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. గోకవరం, కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రులకు చెందిన వైద్యులు వనజ, నిఖిత సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు అవసరం

దివాన్‌చెరువు: మహిళావైద్యుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేకచట్టాలు చేయాల్సిన అవసరం ఉందని పీఎంపీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, రాజానగరం మండలశాఖ అధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ కలకత్తాలో మహిళా వైద్యురాలిపై ఇటీవల జరిగిన ఘటన సభ్యసమాజం సిగ్గుతో తల దించుకునే విధంగా ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.

రంగంపేట: కోల్‌కత్తాలో పీహెచ్‌సి మెడికల కళాశాలలో మహిళా వైద్యురాలిపై అనుమానుషంగా సామూహికంగా అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని రంగంపేట మండలం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు బి.వేణుశ్రీలక్ష్మీ,సంకీర్తన, కె.చిన్నారాలు ఆధ్వర్యంలో వైద్యసిబ్బందితో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి: డాక్టర్ కార్తీక్

రాజమహేంద్రవరం సిటీ: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సామాజిక ఉద్యమ కారుడు డాక్టర్ కార్తీక్ సింగంపల్లి డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో తన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్యూటీలో ఉన్న 31 ఏళ్ల మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన దేశ ప్రజలను కలచివేసిందన్నారు. ప్రాణాలను కాపాడే వైద్యురాలిపట్ల జరిగిన దారుణం పునరావృతం కాకుండా మహిళా వైద్యులకు ప్రత్యేక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

● తీవ్రంగా ఖండించిన పోష్ కమిటీ సభ్యులు

కోలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ (డీసీహెచ్ఎస్) పోష్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన జాతి యావత్తు సిగ్గుపడే అంశమని, నిరసన తెలుపుతున్న వైద్యులకు సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. చట్టాలు కఠినంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

చింతూరు రెవెన్యూ డివిజన్‌లో వైద్య సిబ్బంది ఆందోళన

చింతూరు: శనివారం చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వైద్యఆరోగ్యశాఖ వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీలు పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఈ ఆందోళనలో ముందుగా చింతూరు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి చింతూరు ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రధానసెంటర్లో మానవహారం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఎర్రంపేట మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చింతూరు అటవీ శాఖ టింబర్ డిపో ఎదుట వైద్యాధికారులు ఒక సన్నివేశాన్ని ప్రదర్శించారు. చింతూరు ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపట్టి ప్లేకార్డులతో నినాదాలు చేశారు. వైద్యాధికారులు పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రం చింతూరు ఐటీడీఏ ఏపీవో సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో జిల్ల ఉప వైద్య ఆరోగ్య శాకాధికారి డాక్టర్ పుల్లయ్య, చింతూరు సీహెచ్‌సీ పర్యవేక్షణాధికారి డాక్టర్ కోటిరెడ్డి, నాల్గు మండలాల్లోని వైద్యులు కౌశిక్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, సూర్యప్రకాష్, జ్యోష్న రమణరావు, స్పందన, విష్నుమాస్సెస్, శ్రీదేవి, రాజీవ్, సాయి కిషోర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్స్ అంగన్‌వాడీలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని రంపచోడవరంలో ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులపై జరుగుతున్న ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

కూనవరం: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరిపి హత్య చేసిన సంఘటనకు నిరసనగా కూనవరం మండలంలో 24 గంటలు పాటు వైద్య సేవలు నిలిపివేశారు. కేవలం ఎమర్జెన్సీ సేవలు మాత్రమే కొనసాగించారు. ఈసందర్భంగా కూనవరంలో విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహేష్, వైద్యులు శ్వేత, తేజు, డాక్టర్ వివేక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం: కలకత్తాలో మెడికల్ విద్యార్థిని అత్యాచారం, హత్య సంఘటనతో శనివారం మోతుగూడెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బం ది, జిల్లా పరిషత్ హైస్కూల్ 9,10వ తరగతి విద్యార్థులు, టీచర్స్‌తో ఏపీ జెన్కో హస్పటల్ మహిళా డాక్టర్ ప్రవళిక గ్రీష్మ ఆరోగ్య కేంద్రం నుంచి జగదాంబ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో హస్పటల్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది రంగమ్మ, శ్యామల కన్నారావు, స్టాఫ్‌నర్సులు, ఆశావర్కర్స్, జెన్కో ఎంప్లాయిస్ మహిళా సిబ్బంది, మహిళా సిబ్బంది, టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎటపాక: కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచార ఘటనను ఖండిస్తూ శనివారం రాత్రి లక్ష్మీపురం గ్రామంలో జాతీయ రహదారిపై వైద్యసిబ్బంది, ఆశాలు, గ్రామస్తులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో వైద్య సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు లక్ష్మీపురం పీహెచ్‌సీ నుంచి ప్రధాన సెంట ర్‌వరకు నినాదాలతో నిరసన తెలిపారు.

వై.రామవరం: కోల్‌కత్తలో వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం జరిపి పాశవికంగా హత్యచేసిన సంఘటనను నిరసిస్తూ శనివారం వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నింధితులను కఠినంగా శిక్షించాలని వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వారు నినాదాలు చేశారు.

ఉపాధి నిధులు దుర్వినియోగం

● అధికారులపై ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆగ్రహం



ఉపాధి ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట, ఆగస్టు 17 : మండలంలోని 2023-24కిగాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంద్వారా ఖర్చుచేసిన నిధులన్నీ పూర్తిగా దుర్వినియోగం అయ్యాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన 2023- 24కి ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా చేపట్టిన పనులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఏ.మోఖలింగం ఆధ్వర్యంలో జరిగిన మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ తనిఖీలో అవినీతి లీలలు బయటికి వచ్చాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ప్రోద్భలంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తప్పులు చేశారన్నారు. వెంకటాపురంలో జరిగిపోయిన వర్క్‌కి మరలా బిల్లులు పెట్టడం ఇంజనీరింగ్ చరిత్రలో ఎక్కడా ఉండదన్నారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో మస్టర్లలో అవినీతి జరిగిందన్నారు. సింగంపల్లిలో పనులకు రాని వారికి, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా మస్టర్లు వేశారు. ఇంత దారుణంగా యథేచ్ఛగా దారుణానికి పాల్పడిన వారిపై విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ప్రజలకు ఇకనుంచి ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమం ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. 4,85,00 రూపాయలు రికవరీ, ఫైన్‌ల రూపంలో విధించామని పథక సంచాలకుడు ఏ.మోఖలింగం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరత్నం, జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిండ్, మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, మండల బీజేజీ అధ్యక్షుడు ఎం.సాయిరాం, మండల జనసేన అధ్యక్షుడు జి. సత్తిబాబు, మాజీ ఎంపీపీ నీలపాల త్రిమూర్తులు అంబుడ్స్ మెన్ ఖాదర్‌బాషా, పోతుల వెంకటరావు, ఉండవిల్లి గిరిబాబు, మండల కూటమి నాయకులు, హౌసింగ్ ఏఈ పాండురంగా, ఉపాధిహామీ ఏపీవో వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఎకరానికి గోదావరి సాగునీరు అందిస్తాం '

రంగంపేట మండలంలో గల ప్రతి ఎకరానికి గోదావరిసాగు నీరు అందిస్తామని, ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో చాగల్నాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో గోదావరి సాగునీరు అందించాలనే దానిపై అధికారులు, రైతులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల నుంచి చాగల్నాడు కాలువ గురించి ప్రయత్నిస్తూనే ఉన్నామన్నారు. రెండు పంపులు పనిచేస్తూ వాటి ద్వారా ప్రధాన కాలువలోకి నీరు వచ్చినప్పటికీ రైతులకు నీరు అందటంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారని, దీని గురించి ప్రతి గ్రామం నుంచి ఒకరుచొప్పున ఒక కమిటీగా ఏర్పడి నాతో సహా అందరం కలిసి 10 రోజులపాటు మనమే లస్కర్లులా పొలంలో తిరిగి ఎక్కడ సమస్య ఉందో దానిని పరిష్కరించే దిశగా పనిచేద్దామని ఆయన పిలుపు నిచ్చారు.

వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు

● వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సందర్శన

కడియం, ఆగస్టు 17: ప్రస్తుతం వరిపంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశిస్తోందని గుర్తించినట్లు జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ డా. చల్లా వెంకటనరసింహరావు, జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఎస్.మాధవరావులు తెలిపారు. కడియం ఆవ ప్రాంతంలో ఉన్న వరి పొలాలను శనివారం వారు వ్యవసాయశాఖ ఏడీశ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి ద్వారకాదేవిలతో సందర్శించారు. వరిపంటను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ వరిసాగు చేసే కొన్ని ప్రాంతాల్లో ఆకు ఎండుతెగులు క్రిసక్ దశ ఆశించినట్లు గుర్తించామని, రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటం, ఉష్ణోగ్రత 22-26 డిగ్రీల సెంటిగ్రేడ్, అధిక నత్రజని వాడటం నీడ సోకే ప్రాంతాలు వ్యాధి తీవ్రతను పెంచుతాయన్నారు. సాగునీరు ద్వారా ఒక పొలం నుంచి మరో పొలానికి తెగులు వ్యాపిస్తుందన్నారు. నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేసి ఎండలు కాసిన తరువాత వేసుకోవాలన్నారు. సిఫార్సు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) రెండు దఫాలుగా నాట్లు వేసిన దశలోను, చిరుపొట్టదశలోను వేయాలన్నారు. లీటర్ నీటికి 0.5 నుంచి 1 గ్రా, స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ (ప్లాంటోమైసిన్), కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు కలిపి వారం నుంచి పదిరోజుల్లో రెండుసార్లు పంటకు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడియం గ్రామ రైతులు ఉన్నారు.



కడియం: ఆవలో వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నేరాల సంఖ్య తగ్గాల్సిందే

● నేర సమీక్షలో ఎస్పీ నరసింహ



రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల సంఖ్య అదుపు లోకి రావాల్సిందేనని, శాఖలోని ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించా లని ఎస్పీ నరసింహకిషోర్ పేర్కొన్నారు. శనివారం ఆయన నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసులపై దృష్టి సారించడంతో పాటు పక్కా ఆధారాలు కోర్టుకు సమర్పించడం ద్వా రా నేరస్తులకు శిక్షలు పడే సంఖ్యను పెంచాలన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా సవ్యంగా వినియోగించుకోవడం, మాదకద్రవ్యాల వల్ల ముప్పు, మహిళలు, బాలికలపై నేరాల అడ్డుకట్ట వంటి వాటిపై స్కూల్స్ కాలేజీలు, ట్రాఫిక్ కూడళ్లు, వార్డుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయనఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీకోసం)కు వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో త్వరగా పరిష్కరించాలన్నారు. గంజాయి, డ్రంక్‌అండ్‌డ్రైవ్, సారావంటి వాటిని ఉపేక్షించవద్దని ఎస్పీ చెప్పారు.

19న టీటీడీ శ్రీనివాస కల్యాణోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 17: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మన్యం ఫణికుమార్, సునీత దంపతుల సౌజన్యంతో ఈ నెల 19 సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక జేఎన్ రోడ్డులోని మన్యం గార్డెన్స్‌లో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, నిర్వాహకుడు సాయికృష్ణ తెలిపారు. అలాగే కోలాటం, భరత నాట్య ప్రదర్శనలు, ప్రవచనాలు ఉంటాయని, భక్తులు కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసినదిగా

ఘనంగా ముత్యాలమ్మ బోనాల జాతర

గోకవరం, ఆగస్టు17: మండలంలోని పెంటపల్లి గ్రామంలో ముత్యాల అమ్మవారి జాతర మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం కనుల పండువగా సాగింది. బాజా భజంత్రీల నడుమ బాణ సంచాలతో సుమారు 150 మంది మహిళలు బోనాలతో ఊరేగించి అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. లాటరీ ద్వారా ఎంపికైన ఐదుగురు మహిళలకు నిర్వాహకులు బంగారు రూపులను అందజేశారు.

అప్పుల బాధతో వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఉరి వేసుకోవడంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అర్జున్‌కుమార్ ఫ్యాన్సీ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యం బాగోకపోవడంతో రెండు రోజులుగా వ్యాపారం చేయ డం లేదు. ఈ క్రమంలో అప్పు ఇచ్చిన మహవీర్‌సింగ్ తన వద్ద తీసుకున్న డబ్బులు ఈ రోజే ఇచ్చేయాలని ఒత్తిడి చేశాడు. దీంతో తన సోదరుడు ఉరి వేసుకున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కైలాశ్ కుమార్ పేర్కొన్నాడు.

డ్వాక్రా మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

● డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజానగరం, ఆగస్టు 17: డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి అన్నారు. రాజానగరంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్త్రీనిధి ఉన్నతికి సీసీలు, సిబ్బంది తమ టార్గెట్‌లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. డ్వాక్రా సంఘాలకోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సభ్యులకు వివరించాలన్నారు. జీవనోపాధి కోసం ఇస్తున్న రుణాల ద్వారా ఆర్థికాభివృద్ధి రెట్టింపు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. వీవోలు, సీసీలు ఎప్పటికప్పుడు గ్రూపు మీటింగ్‌లు నిర్వహించాలన్నారు. ఏరియా కోఆర్డినేటర్ జనార్ధన్, ఏపీఎం కర్రి హేమనాగలక్ష్మి, వీవోలు, సీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి: జేసీ

రాజానగరం, ఆగస్టు 17 : రైతులు తప్పని సరిగా ఈ-పంట నమోదును చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాము డు కోరారు. మండలంలోని నరేంద్ర పురం గ్రామంలో ఈ-పంట నమో దు కార్యక్రమాన్ని శనివారం జేసీ ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. రైతులు ఈ-పంట నమోదు కార్యక్రమంలో భాగంగా రైతులు తమ పంటను నమోదు చేసుకోవడంతోపాటు కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. వీటి ద్వారా బ్యాంకు రుణాలు, ధాన్యం కొనుగోలు సొమ్ములు వారి ఖాతాలో నేరుగా జమచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, తహసీల్దార్ ఎన్.లక్ష్మీ లావణ్య, వ్యవసా యాధికారి ఎస్‌కె ఇమామి ఖాసిమ్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం

గోకవరం, ఆగస్టు 17: గోకవరం మండలం తంటికొండ గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి శాంతికల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆయన సతీమణి మణమ్మ, తనయుడు, టీడీపీ కాకినాడజిల్లా అధ్యక్షుడు జ్యోతులనవీన్, లక్ష్మీదేవి దంపతులచే శాంతి కల్యాణం నిర్వహించారు. నవీన్, లక్ష్మీదేవి దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం జరిపించారు. కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు ఆలయ అధికారులు ప్రసాద వితరణ చేసారు. అన్నసమారాధన కూడా నిర్వహించారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యుజే కృషి

అనపర్తి, ఆగస్టు 17: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఏపీడబ్ల్యుజే కృషి చేస్తుందని అనపర్తి నియోజకవర్గ ఏపీయూడబ్ల్యుజే ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి(బుజ్జి) అన్నారు. శనివారం ఏపీయూడబ్ల్యుజే 67వ వార్షికోత్సవం సందర్భంగా అనపర్తి ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటుచేసిన యూనియన్ జెండాను శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే పాత్రికేయులకు అండగా నిలవడంలో ఏపీయూడబ్ల్యుజే పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలి

● జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారాయణ

కోరుకొండ, ఆగస్టు17: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా నాణ్యమైన విద్యాబోధన విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారాయణ పేర్కొన్నారు. కోరుకొండ మండ లంలో జరుగుతున్న గాడాల, కోరుకొండ పాఠశాల సముదాయ సమావేశాలను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి.కుశలవ దొర, సుజాత, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జ్యోతి,సీఆర్పీ మోహన్‌రావు, గాదరాడ, గాడాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని సబ్జెక్టులకు మూలం మాతృభాషే

కడియం, ఆగస్టు 17: ఓ విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తున్నాడంటే ఆ విద్యార్థికి మాతృబాషలో చక్కని పరిచయం ఉందని మనం గ్రహించాలని, అదే విద్యార్థి మాతృభాషలో వెనుకబడితే మిగిలిన సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటాడని ఏఎల్ఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ కనకబాబు తెలిపారు. రూరల్, కడియం మండలానికి చెందిన తెలుగు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శనివారం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓరోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఈవో వై.నాగేశ్వరరావు, సెకండరీ గ్రేడ్ టీచర్ల శిక్షణా తరగతులను ప్రారంభించారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌కు వాటర్ ట్యాంక్ బహూకరణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 17: రాజమహేంద్రవరం గాంధీపురం-2లో ఆనంద నిలయం అనే ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహానికి జిల్లా ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వాటర్ ట్యాంక్‌ను బహూకరించింది. అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాజమహేంద్రవరం కార్పొరేషన్ డీడీ పాడి రామారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి వాటర్ ట్యాంక్‌ను అందజేశారు.

ఉత్కంఠగా కోరుకొండ హైస్కూల్ విద్యాకమిటీ ఎన్నిక

● ఎమ్మెల్యే చొరవతో ఏకగ్రీవ్రం

కోరుకొండ, ఆగస్టు 17: కోరుకొండ హైస్కూల్ విద్యాకమిటీ ఎన్నిక ఉత్కంఠ భరిత వాతావరణం మధ్య శనివారం సాయంత్రం ఏకగ్రీవంగా జరిగింది. ఒక దశలో పాఠశాల విద్యాకమిటీ 15మంది సభ్యులు ఏకగ్రీవంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన 15 మంది సభ్యుల్లో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను ఎన్నుకోవాల్సి ఉంది. ఛైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నప్పటికీ వైస్‌ఛైర్మన్ ఎన్నిక విషయంలో సభ్యులు ఏకాభిప్రాయం రాలేకపోవడంతో మధ్యాహ్నానికి ముగియాల్సిన ఎన్నిక సాయంత్రం 6గంటలవరకు కొనసాగింది. ఒక ప్రక్క కూటమి నాయకులు, కార్యకర్తలు, మరోప్రక్క విద్యార్థుల తల్లిదండ్రులు అదుపు చేసేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. ఈదశలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతీసుకుని హుటాహుటిన హైస్కూల్ వద్దకు చేరుకుని కూటమి నాయకులు, కార్యకర్తలకు, కమిటీ సభ్యులకు సర్ది చెప్పడంతో వారంతా శాంతించారు. చివరికి ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా చెలగంశెట్టి శివరామకృష్ణ, వైస్‌ఛైర్మన్ మాతా రాజేశ్వరిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజ్‌మనోజ్ సేవలు ప్రశంసనీయం: ఎంపీపీ

కడియం, ఆగస్టు17: ఎన్నికల విధుల్లో భాగంగా కడియం ఎంపీడీవోగా వచ్చిన రాజ్‌మనోజ్ సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. మనోజ్ తిరిగి సొంత మండలానికి వెళుతున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎంపీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో సత్కారం చేశారు. ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు జరగడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన రూపొందించిన గ్రీన్‌బెల్ట్ ప్రాజెక్టు అందరి ప్రశంసలను అందుకుందన్నారు. ఎంపీడీవో మనోజ్‌ను ఘనంగా సత్కరించారు.



పోలవరం నిజాలకు.. నిప్పుపెట్టారా!?





పోలవరం నిజాలకు నిప్పుపెట్టారా!? ఆ కార్యాలయం వద్ద పరిస్థితి చూస్తే అవుననే అనిపిస్తుంది.. అధికారులు మాత్రం అదేం కాదని కొట్టిపారేస్తున్నారు.. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయం వద్ద కొన్ని పత్రాలను శుక్రవారం దగ్ధం చేశారు. ఆ పత్రాల్లో భూనిర్వాసితుల ఆధార్‌కార్డులు.. ఫొటోలు.. తదితర పత్రాలు ఉన్నాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో కలెక్టర్ ప్రశాంతి శనివారం విచారణకు ఆదేశించారు. అధికారులు రంగంలోకి దిగారు.. ఈ లోపునే తగలబెట్టిన పత్రాలను సిబ్బంది అక్కడి నుంచి తరలించేయడం గమనార్హం. పనికిరానివైతే ఎందుకు తరలించారనేది ప్రశ్నార్థకం..? - వివరాలు మెయిన్‌లో

తగలబెట్టిన పోలవరం భూనిర్వాసితుల పత్రాలు...
పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



కొవ్వూరులో ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది



ఓపీ సేవలు నిలిపివేయడంతో ఖాళీగా ఉన్న జీజీహెచ్ ఆసుపత్రి ఆవరణ

వైద్యం అందక.. విలవిల

కోల్‌కతా ఘటనకు నిరసన.. సేవలు బంద్

- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు మూత
- ఐఎంఏ పిలుపుమేరకు నిలిచిపోయిన సేవలు
- సమాచారం అందక క్యూకట్టిన రోగులు
- వైద్యం అందించమని వేడుకోలు
- అత్యవసర వైద్య సేవలందినట్టు సమాచారం
- ఎక్కడికక్కడ వైద్యుల నిరసన ప్రదర్శనలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17 : వైద్యం బంద్ కావడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. సేవలందక ఆపసోపాలు పడ్డారు.. కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ ఐఏఎం పిలుపుమేరకు శనివారం వైద్య సేవలు నిలిపివేశారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి), జిల్లా వ్యాప్తంగా సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ఓపీ సేవలను నిలిపివేయడంతో రోగులు వైద్య అందక విలవిల్లాడిపోయారు. ఎక్కడెక్కడి నుంచో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చినా వైద్యం అందలేదు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో వందలాది ఆసుపత్రులు ఉంటాయి. ఆసుపత్రులకు ప్రతి రోజూ వేలాదిగా రోగులు, బంధువులు వస్తుంటారు. అయితే ఆయా ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలను నిలిపివేయడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడారు. వైద్య సేవలు నిలిపివేయడంతో నిరాశగా వెనుతిరిగారు. చాలా ఆసుపత్రుల వద్ద రోగులు చాలా దూరం నుంచి వచ్చాం.. డాక్టర్‌గారిని చూడమనండి.. మళ్లీ రావాలంటే చాలా కష్టం అంటూ ఆసుపత్రి సిబ్బందిని బ్రతిమలాడుకోవడం కనిపించింది. అయితే ఆసుపత్రి సిబ్బంది ఏ మాత్రం కనికరించలేదు. ఇక జీజీహెచ్ నర్సింగ్ స్టాఫ్, ఇతర వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆసుపత్రిలో పనివేళల్లో తమకు భద్రత కల్పించాలని, మృతి చెందిన జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఐఎంఏ పిలుపుతో వైద్యులు చాలా మంది అందుబాటులో లేకుండా పోయారు. అత్యవసర ఓపీ సేవలు మాత్రమే కొనసాగించారు. సాధారణ ఓపీ లేక దూరప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన రోగులు నానా ఇబ్బందులు పడ్డారు.మరోపక్క ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సైతం నిరసనకు పిలుపు ఇవ్వడంతో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు సైతం ఓపీ వైద్యసేవలను బంద్ చేశారు. దీంతో దూరప్రాంతాల నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్జరీలు కూడా చేయలేదు. ఐఎంఏ వారు రామాలయం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఆసుపత్రి సేవలు అత్యవసర సర్వీసులుగా పరిగణిస్తారు. ఏదైనా నిరసన తెలియజేయాలంటే ముందస్తు ప్రచారం, సమాచారం ప్రజలకు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఐఎంఏ దీన్ని పట్టించుకోకుండా తక్కువ సమయంలోనే నిరసనకు పిలుపునివ్వడంతో చాలా మందికి సమాచారం చేరలేదు. విషయం తెలియకపోవడంతో ఎక్కడెక్కడి నుంచో ఆసుపత్రులకు వచ్చిన రోగులకు అగచాట్లు తప్పలేదు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ప్రతిరోజూ సుమారు రెండు, మూడు వందల మంది సాధారణ ఓపీకి వస్తుంటారు. శనివారం కావడంతో ఈ సంఖ్య కాస్త తక్కువగానే ఉన్నా వచ్చిన వారంతా అనేక వ్యయప్రయాసలతో రావడంతో ఇబ్బందులు తప్పలేదు. ఆదివారం ఎలాగూ ఓపీ ఉండదు. వైద్యానికి సోమవారం వరకూ వేచి ఉండాల్సి ఉంటుంది. అలాగే, ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఓపీ ఎక్కువగానే ఉంటుంది. ఒక్కో ఆసుపత్రిలో ఎంతలేదన్నా ఐదారు వందల మంది ఓపీకి వస్తుంటారు. అయితే శనివారం మాత్రం వైద్యుల నిరసన కారణంగా ప్రజలకు తిప్పలు తప్పలేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలు బంద్ చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా జూనియర్ డాక్టర్‌ను హత్య చేయడం అమానవీయమని రాజమహేంద్రవరం జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కందుకూరి శ్యామ్‌కుమార్, సరాకుల సుధాకర్ పేర్కొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిరసన

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 17: కోల్‌కతాలో వైద్యవిద్యార్థిపై జరిగిన పాశవిక దాడికి నిరసనగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన సంఘటన కలచివేసిందన్నారు. వైద్యులకు భద్రత అవసరమని అన్నారు. జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల సంఘం డాక్టర్ మౌనిక మాట్లాడుతూ హత్యకు గురైన వైద్యురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైద్యులను గౌరవించడం భద్రత కల్పించి కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు.ఆరోగ్యవంతమైన సమాజం కోసం అహర్నిశలు పాటుపడే వైద్యులపై ఇటువంటి దాడులకు పాల్పడడం విచారకరమని ఇటువంటివాటిని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ షమ్మీకుమార్ , డేమో సత్య కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద సిబ్బంది నిరసన

జాంపేట అర్బన్ బ్యాంక్ బరిలో 26 మంది



నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న జగన్నాథరెడ్డి

రాజమహేంద్రవరం,ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి) : జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల స్క్రూటీన్లో నాలుగు నామి నేషన్లు వివిధ కారణాల వల్ల తిరస్కరించినట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్, జాంపేట బ్యాంక్ ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి శనివారం రాత్రి తెలిపారు. 12 డైరెక్టర్ల పదవులకు మొత్తం 37 నామినేషన్లు దాఖలు చేశారు.వీటిలో నాలుగు స్క్రూటీన్లో పోగా, ఏడు రెండేసి సెట్లు రావడంతో ఒక్కొక్కటి తొలగించామన్నారు. మొదటి నియోజక వర్గం 21, రెండో నియోజకవర్గంలో 2, మూడో నియోజకవర్గంలో 3 నామినేషన్లు అనుమతించినట్టు తెలిపారు.ఆదివారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆ తరువాత ఎన్నికల్లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసు

ఘంటావారిగూడెంలో ఘటన.. ఆరుగురిపై కేసు నమోదు

నల్లజర్ల,ఆగస్టు 17 : నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో ఉన్న రాజేశ్వరి ఫాం హౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, నల్లజర్ల సీఐ ఎన్ శ్రీనివాస్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గుణ్ణం సురేష్ తన పుట్టిన రోజు వేడుకను శుక్రవారం రాత్రి ఫాంహౌస్‌లో ఘంటా యువరాజు సహాయంతో ఏర్పాటు చేశాడు. బంధుమిత్రులకు విందుతో పాటు వినోదం కల్పించేందుకు కిలపర్తి దుర్గా శ్రీనివాస్ అనే మధ్యవర్తి ద్వారా నలుగురు యువతలను తీసుకుని వచ్చి సినిమా పాటలకు డ్యాన్స్ వేయించాడు.ఆ ఫంక్షన్ హాజరైన కొందరు వీడియో తీసి గ్రూపుల్లో పెట్టడంతో శనివారం వైరల్ అయ్యింది. విచారణ చేపట్టగా నిర్వాహకులు గుణ్ణం సురేష్,ఘంటా యువరాజులపై చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్టు గుర్తించారు.ఈ మేరకు నల్లజర్ల సీఐ, దేవరపల్లి ఎస్ఐ తక్షణమే స్పందించి తమ సిబ్బందితో వెళ్లి సురేశ్, యువ రాజు, శ్రీనివాస్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. డ్యాన్సర్లను మండపేటకు చెందిన వారని తెలిపారు.

నల్లజర్లలో జరిగింది రేవ్ పార్టీ కాదు : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రేవ్ పార్టీ జరిగిందని,పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వస్తున్న వార్తలు అవాస్తవాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. వదంతులను సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా వ్యాప్తి చేస్తే కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులపై ఇప్పటికే ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. సాధారణ జనజీవనానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడం నేరమన్నారు. ఇటువంటి ఘటనలపై సమాచారమివ్వాలన్నారు.

పౌర హక్కుల సేవా రోజుగా నాలుగో శనివారం : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 15 : మండల స్థాయిలో ప్రతి నెల నాలుగో శనివారం పౌరహక్కుల సేవా రోజు నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సమీకృత కుల ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్సీ కార్డులు, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఎస్ఎస్ఆర్-2025 ఓటర్ల జాబితా తదితర అంశాలపై కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చిన అర్జీలను సోమవారం నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 187 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రానున్న నెల రోజుల్లో ఎస్సీ ఎస్టీ కమిషన్ జిల్లా పర్యటన నేపథ్యంలో కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 28 నుంచి బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేపట్టి ఓటరు జాబితా సవరణ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్షా నాలుగు వేల 622 మంది రైతుల సీసీఆర్సీ నమోదు చేశామన్నారు. రాజమహేంద్రవరం 546, కోరుకొండ 472, బిక్కవోలు 427 మంది రైతులు వివరాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.జిల్లాలో సాగుకింద రాని సుమారు 15 వేల హెక్టార్ల విస్తీర్ణం ఉందన్నారు.సమావేశంలో జేసీ చినరాముడు,డీఆర్‌వో జి.నరసింహులు, ఏవో పాపారావు పాల్గొన్నారు.

కొవ్వూరు సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ బదిలీ



రాజమహేంద్రవరం, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ బదిలీ అయ్యారు. ఆయనను పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది.కొవ్వూరుకు ఎవరినీ నియమించ లేదు. ఐఏఎస్ ఆఫీసరైన శ్రీవాత్సవ ఎన్నికల ముందు కొవ్వూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరించి మంచి పేరుతెచ్చుకున్నారు.

అమ్మో.. జ్వరం

గోకవరం మండలంలో వణుకుతున్న జనం



రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త..
చినుకు పడితే చింతే..
డ్రైనేజీ లేక ఇళ్ల మధ్యనే నిలిచిన మురుగు

గోకవరం, ఆగస్టు 17 : గోకవరం మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి..ఏ గ్రామంలో చూసినా జనం జ్వరంతో వణికిపోతున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. జ్వరపీడితులను గుర్తించి ప్రభుత్వాసుపత్రులకు పంపుతున్నారు.అయితే ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.దీంతో ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, టైఫాయిడ్ తదితర కేసులు నమోదవుతున్నట్టు ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు. డెంగీ వచ్చి న రోగులు ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో ప్రాణపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.మరో వైపు టైఫాయిడ్ జ్వరపీడితులు ఉంటున్నారు. కొంతమంది రోగులు ఆర్ఎంపీలను ఆశ్రయించి వైద్యం చేయించుకుంటున్నారు. మండలంలో ఎక్కువగా మల్లవరం,గోకవరం, తంటికొండ, కృష్ణునిపాలెం, వెదురుపాక, ఇటికాయిలపల్లి, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో జ్వరపీడితులు ఉన్నారు. ఏ ఇంటి తలుపు తట్టినా ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారనే సమాధానమే వినిపిస్తుంది. ఇదిలా ఉంటే మండలంలో ఎక్కడా డెంగీ జ్వర పీడితులు లేరని..డెంగీకి సంబంధించి వైద్య పరీక్షలు ప్రభుత్వాసుపత్రుల్లో చేయించుకుంటేనే సరైన స్పష్టత వస్తుందని ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. డెంగీ జ్వరాలు లేకపోతే ప్లేట్‌లెట్స్ ఎందుకు తగ్గుతాయంటూ పలువురు రోగులు ప్రభుత్వ వైద్యులను ప్రశ్నిస్తు న్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు ఒక పక్క.. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ము రుగు నీరు నీరు నిల్వ ఉండడం, అపారిశుద్ధ్యం, తాగు నీరు కలుషితం కావడం తదితర కారణా లతో జ్వరాలు ప్రబలుతున్నాయి. మండలంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. రక్షిత నీటి పథకాల ట్యాంకుల శుభ్రత మొదలు, చెత్త, తొలగింపు వరకు నిర్లక్ష్యం రాజ్యమేలుతుంది. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా, ఆచరణలో మా త్రం అంతగా ప్రయోజనం కని పించడంలేదు. ఇటీవల కురుస్తున్న వర్షా లకు రోడ్లు బురదమయంగా మారగా, డ్రైనేజీ సిల్ట్‌తో నిండిపోయింది. గ్రామాల్లో రహదారులు, జనంతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు చెత్తకుప్పలతో నిండి డంపింగ్ యా ర్డులను తలపిస్తున్నాయి. పలుచోట్ల మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వదజల్లుతుంది. 15 రోజులకోసారి మంచినీటి ట్యాంకులను శుభ్ర పరిచి క్లోరినేషన్ చేయాల్సిన పద్ధతులు ఎక్కడా కానరావడంలేదు.

సురక్షితమైన మంచినీటిని తాగాలి

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు

పెరవలి, ఆగస్టు 17: వివిధ రకాల అనారోగ్యాల నుంచి కాపాడుకోవడానికి ప్రజలందరూ సురక్షితమైన మంచినీటిని తాగాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. ముక్కామల శివారు ముత్యాలవారిపాలెంలో శ్రీనివాస ఇంజనీరింగ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సానం సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో కేంద్రం రాష్ట్ర సహకారంతో పథకాలు ఏర్పాటు చేస్తోందని, ఆలాగే పలు చోట్ల దాతల సహకారంతో శుద్ధి చేసిన నీటిని అందించడానికి ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక భూ సమేత వరదనాథ స్వామి ఆలయం వద్ద ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైస్ ఎంపీపీ వేండ్ర శ్రీనివాస్, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ గండేపల్లి రామకృష్ణ, రవి వర్మ, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవి, మాజీ ఎంపీపీ కోటిపల్లి మురళీకృష్ణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరులో తాగునీటి సమస్య పరిష్కరించాలి



రాజీవ్‌కాలనీలో కుళాయి వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు, బీజేపీ నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 17: కొవ్వూరు 1వ వార్డు రాజీవ్‌కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్‌ట్యాంకు నిర్మాణం చేపట్టాలని బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని రాజీవ్‌కాలనీ, ఇందిరమ్మకాలనీ, బ్రిడ్జిపేట, యానాది కాలనీ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించకపోవడం అధికారులు, ప్రజా ప్రతినిధుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది తాగునీటి పంపింగ్ స్కీమ్‌లోని మోటార్లు మరమ్మతులు, విద్యుత్ సరఫరా సమస్యలను సాకుగా చెబుతున్నారన్నారు. పట్టణంలోని తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి, కొత్త పైపులైను నిర్మాణానికి సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు కృషి చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు.

అరుణోదయ సేవా సంఘం అధ్యక్షుడిగా రవి



గోపాలపురం, ఆగస్టు 17 : గోపాలపురంలోని ఎన్‌టీఆర్ కాలనీలో బాబు జగ్జీవన్‌రామ్ అరుణోదయ సేవా సంఘాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాపల రవి, ఉపాధ్యక్షుడిగా దిర్శిపో మురళీ, కార్యదర్శిగా దున్నా వెంకట్రావు, సహాయ కార్యదర్శిగా పసలపూడి జయరాజు, కోశాధికారిగా అయినపర్తి సత్తిపండును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రవి మాట్లాడుతూ ఎన్‌టీఆర్ స్ఫూర్తితోనే సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశంతో అరుణోదయ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు.

అపుస్మా కొవ్వూరు నూతన కార్యవర్గం ఎన్నిక



అపుస్మా కొవ్వూరు నూతన కార్యవర్గంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రెడ్డి

తాళ్లపూడి, ఆగస్టు 17: ప్రైవేటు విద్యా సంస్థల సంఘం అపుస్మా కొవ్వూరు జోన్ నూతన కార్యవర్గ ఎన్నికలు తాళ్లపూడిలోని మాంటిస్సోరి పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. అధ్యక్షుడిగా మాంటిస్సోరి విద్యాసంస్థ కరస్పాండెంట్ వీవీ అనీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొవ్వూరు సద్గురు పాఠశాల ప్రిన్స్‌పాల్ పి.వెంకటరత్నం, కోశాధికారిగా చాగల్లు సెయింట్ లూయిస్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్.తిమోతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌తో చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థలన్నీ ఐక్యంగా ఉండి అపుస్మా బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల ప్రవేటు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో పిల్స్ పంపిణీ

ఉండ్రాజవరం, ఆగస్టు 17: పాలకొల్లుకు చెందిన ప్రముఖ హోమియోపతి వైద్యనిపుణులు డాక్టర్ కోసూరి రామకృష్ణనందరాజు ఆధ్వర్యంలో శనివారం ఉండ్రాజవరంలో ఉచిత హోమియో పిల్స్‌ను పంపిణీ చేశారు. డాక్టర్ టెలికాలింగ్ ద్వారా రోగుల వివరాలను తెలుసుకుని 31మందికి ఉచితంగా దీర్ఘకాలిక వ్యాధులపై సలహాలు, సూచనలు, పిల్స్ పంపిణీ చేశారు.

పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



దేవర పల్లి, ఆగస్టు 17: స్వాతంత్య్ర వేడుకలు సందర్భంగా మండలంలోని యాదవోలు హైస్కూల్లో విద్యార్థులకు వివిధ క్రీడలు, రాతపరీక్షలు, డ్రాయింగ్, నిర్వహించారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు కూటమి నాయకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నుదురుమాటి శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ వీరకొండ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో మానవత శాంతి ర్యాలీ

దేవర పల్లి, ఆగస్టు 17: దేవరపల్లిలో మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలాధ్యక్షుడు రామరాజు, రాష్ట్ర నాయకుడు బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో మానవత సభ్యులు తీగల రాజ, పప్పు వెంకటరామారావు, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, బండి సూర్యప్రకాశరావు, యలమాటి సత్యనారాయణ, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో అవకాశం

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ 2023, 2024లో పూర్తి చేసి 75% మార్కులు సాధించిన నాన్-మ్యాథ్స్ గ్రూపు విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్ రోల్స్‌లో అవకాశం కల్పిస్తున్నారని ఇంటర్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(జోన్ 1,2) ఐ.శారద తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆసక్తి కలిగిన సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, వొకేషనల్ విద్యార్థులు ఈ నెల 20న ఉదయం 10గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో హెచ్‌సీఎల్ నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని చెప్పారు. https://bit.ly/tecbeeGoAP లింక్ ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96429 73350 నెంబరు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని ఆర్ఐవో నరశింహం తెలిపారు. కాబట్టి అన్ని యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అర్హత కలిగిన వారందరూ పరీక్షకు హాజరయ్యేటు చూడాలని సూచించారు.

ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

రాజానగరం, ఆగస్టు 17: డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. రాజానగరంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీనిధి ఉన్నతికి సీసీలు, సిబ్బంది తమ టార్గెట్‌లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. డ్వాక్రా సంఘాల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సభ్యులకు వివరించాలన్నారు. జీవనోపాధి కోసం ఇస్తున్న రుణాల ద్వారా ఆర్థికాభివృద్ధి రెట్టింపయ్యేలా కృషి చేయాలని సూచించారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

- ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి
- కోల్‌కతా ఘటనపై నిరసన కార్యక్రమాలు
- ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేత
- ఇబ్బందిపడిన రోగులు.. నిరాశగా వెనుతిరిగిన వైనం

కొవ్వూరు, ఆగస్టు 17: మహిళా వైద్యులకు భద్రత కరువైందని, ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్ అన్నారు. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 9నుంచి 11 గంటల వరకు అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన అన్ని ఓపీ సేవలు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. అనంతరం నినాదాలు చేస్తూ విజయవిహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ సాయికిరణ్ మాట్లాడుతూ కోల్‌కతా మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఉదంతంలో నిందితుడిని తప్పించడానికి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రజనీకుమారి, సత్యకుమారి, వైద్య సిబ్బంది హెడ్‌నర్సు బి.బేబిలక్ష్మి, సీహెచ్ భాగ్యవతి, మదుల వాణి, సీనియర్ అసిస్టెంట్ నీరజ్‌కుమార్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బంది ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంటెండ్ చైతన్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం వైద్య వృత్తిని ఎన్నుకుని మానవత దృక్పథంతో సాటి మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండాలనే వైద్యులు కోరుకుంటారని, సమాజ శ్రేయస్సు కోరే వైద్యులపై అఘాయిత్యాలు జరగడం బాధకరమన్నారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడి నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృత కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, అన్నదేవరపేట, మలకపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు నిరసనను తెలియజేశారు. వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఐఎంఏ పిలుపుమేరకు జరిగిన ఈ సమ్మెలో భాగంగా ప్రైవేటు అసుపత్రి వైద్యులు కూడా నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హారికా గుప్తా, స్వర్ణలత, సుచందన, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ తెల్లం గంగాధర్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసే దాతలకు, మహిళా ఉద్యోగులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. కోల్‌కతా తరహా ఘటనలు ఇకపై జరుగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిరాజ్ వుద్దీన్, వైద్య ఉద్యోగుల సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిపివేశారు. వైద్యులు, వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీలు చేశారు. దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది, దేవరపల్లిలోని సుమంత్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుమంత్ ఆధ్వర్యంలో చంద్రా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ చందన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణాలను రక్షించే వైద్యులను ప్రజలు దేవుళ్లా చూస్తారని అటువంటి జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి వైద్యాధికారులు డాక్టర్ సాంబశివరావు, డీ.సంజీవ్‌కుమార్, గౌరీపట్నం వైద్యాధికారి సతీష్, యాదవోలు వైద్యాధికారులు డాక్టర్ హరిచందన, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దఎత్తున నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిశిత, డాక్టర్ దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం పీహెచ్‌సీ వద్ద డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్లపై దేశంలో జరుగుతున్న అమానుషమైన దాడులను ఖండించారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది



తాళ్లపూడిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



చాగల్లు: బ్రాహ్మణగూడెంలో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది



ఉండ్రాజవరం పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది



నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య బృందం



దేవరపల్లి పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



గోపాలపురం సీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆరోగ్య సిబ్బంది

చేసే పనిపై దృష్టి సారిస్తే విజయాలు సొంతం

- యానిమల్ సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి
- జీఎస్ఎల్-స్వతంత్ర ఇన్స్టిట్యూషన్స్ 38వ వార్షికోత్సవం

రాజానగరం, ఆగస్టు 17: ఏ వృత్తిలో అయినా తాము చేసే పనిపై దృష్టి సారిస్తే విజయాలు సొంతమవుతాయని యానిమల్ సినిమా దర్శకుడు వంగా సందీప్‌రెడ్డి అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన జీఎస్ఎల్-స్వతంత్ర ఇన్స్టిట్యూషన్స్ 38వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేసే పనిపై దృష్టి కేంద్రీకరిస్తే విజయం చేకూరుతుందన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో అధునాతన సౌకర్యాలను కల్పించారన్నారు. అక్కడికి వెళ్లి చదువుకోవాలనిపించే అతి కొద్ది సంస్థల్లో జీఎస్ఎల్ ఒకటిగా నిలుస్తుందన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ తదితర విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థులంతా ఇక్కడ కల్పించిన సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జీఎస్ఎల్ సంస్థల మూలంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, భవిష్యత్తులో జీఎస్ఎల్ సంస్థ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. సందీప్‌రెడ్డి తీసిన యానిమల్, కబీర్ సింగ్ సినిమాల్లో కథకు మెడికల్ పరిజ్ఞానాన్ని జోడించారని ప్రశంసించారు. అనంతరం జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సినీ డైరెక్టర్ సందీప్‌రెడ్డిని, ఎమ్మెల్యే బత్తుల తదితరులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ గన్ని సందీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గన్ని సాధిక, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, మధు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



దర్శకుడి సందీప్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు



వార్షికోత్సవానికి హాజరైన ప్రముఖులు, వైద్య విద్యార్థులు

స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే అమ్మ ఇడ్లీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17: రాజమహేంద్రవరం జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే మూడు ఇడ్లీలు అందజేయడం పేషెంట్లకు, వారి సహాయకులకు ఎంతో ఉపకారమని సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేన్సర్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు పండ్లు పంచారు. రూ.5కు మూడు ఇడ్లీలు, ఒక చట్నీ ఇస్తారని మేనేజర్ రామకృష్ణ తెలిపారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

మంత్రి దుర్గేష్‌కు కంప్యూటర్ ఆపరేటర్ల వినతి



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

నిడదవోలు, ఆగస్టు 17: పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కంప్యూటర్ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు నిడదవోలులోని క్యాంపు కార్యాలయం వద్ద పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత, మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని పేర్కొన్నారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ, గోదావరి జిల్లాల్లోని పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిడదవోలు, ఆగస్టు 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తూ వివిధ సంఘటనల్లో నిందితులైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం నిడదవోలులో ప్రభుత్వాసుపత్రి వద్ద సీఐటీయూ ఆశా వర్కర్స్ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగినుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కలకత్తాలోని మెడికల్ కాలేజీలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని దేశవ్యాప్తంగా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో దయామణి, రాణి, చిన్నారి, హేమలత, జ్యోతి దేవి తదితర్లు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి : జేసీ

రాజానగరం, ఆగస్టు 17: రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదును చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు కోరారు. మండలంలోని నరేంద్రపురంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కొద్దిసేపు మాట్లాడారు. రైతులు ఈ-పంట నమోదు కార్యక్రమంలో భాగంగా రైతులు తమ పంటను నమోదు చేసుకోవడంతో పాటు కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. వీటి ద్వారా బ్యాంకు రుణాలు, ధాన్యం కొనుగోలు సొమ్ములు వారి ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, తహశీల్దార్ ఎస్.లక్ష్మీలావణ్య, వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ఉద్యోగాలు భర్తీ చేయాలి

దివాన్‌చెరువు, ఆగస్టు 17: తమ గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశాకార్యకర్తలు ఉద్యోగాలను భర్తీ చేయాలని కొత్తతుంగపాడు జనసేన పార్టీ నాయకుడు కోలపాటి సుబ్బారావు ప్రభుత్వానికి శనివారం విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో గతంలో ఇద్దరు వ్యక్తులు ఆశా వర్కర్లుగా పనిచేసేవారని, వారిలో ఒకరు దాదాపు 14 నెలలు క్రితం పదవీ విరమణ చేయగా, మరొకరు 6 నెలలు క్రితం ఉద్యోగం మానేశారని చెప్పారు. ఈ పోస్టుల్లో ఇంతవరకూ కొత్తవారిని నియమించలేదని, ఈ ఖాళీలను భర్తీచేస్తే తమగ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్యఆరోగ్యసేవలు అందే వీలుంటుందని అన్నారు.

నిడదవోలులో మానవత శాంతి ర్యాలీ

నిడదవోలు, ఆగస్టు 17: నిడదవోలులోని మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం శాంతిర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి మానవత అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవన్నారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దారపురెడ్డి సూర్యచంద్రరావు, సుంకవల్లి రాము, బండి సత్యనారాయణ, ముళ్లపూడి సోమరాజు, తన్నీడి బోసు, కె.ప్రభాకరం, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమని ఒత్తిడి.. చిరు వ్యాపారి ఆత్మహత్య

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఉరి వేసుకోవడంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన అర్జున్‌కుమార్ ఫ్యాన్సీ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఆరోగ్యం బాగోకపోవడంతో రెండు రోజులుగా వ్యాపారం చేయ డం లేదు.ఈ క్రమంలో అప్పు ఇచ్చిన మహవీర్‌సింగ్ తన వద్ద తీసుకున్న డబ్బులు ఈ రోజే ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. దీంతో తన సోదరుడు ఉరి వేసుకున్నాడని పోలీసులకు కైలాశ్ కుమార్ ఫిర్యాదు చేశాడు.

నేరాల సంఖ్య తగ్గాల్సిందే

- పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసులపై దృష్టి పెట్టాలి
- నేర సమీక్షలో ఎస్పీ నరసింహకిశోర్



రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల సంఖ్య అదుపులోకి రావాల్సిందేనని, శాఖలోని ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. శనివారం ఆయన నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసులపై దృష్టి సారించడంతోపాటు పక్కా ఆధారాలు కోర్టుకు సమర్పించడం ద్వారా నేరస్తులకు శిక్షలు పడే సంఖ్యను పెంచాలన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా సవ్యంగా వినియోగించుకోవడం, మాదకద్రవ్యాల వల్ల ముప్పు, మహిళలు, బాలికలపై నేరాల అడ్డుకట్ట వంటి వాటిపై స్కూల్స్, కాలేజీలు, ట్రాఫిక్ కూడళ్లు, వార్డుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీకోసం)కు వచ్చే ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరగా పరిష్కరించాలన్నారు. గంజాయి, డ్రంక్ అండ్ డ్రైవ్, సారా వంటి వాటిని ఉపేక్షించవద్దని ఎస్పీ చెప్పారు.

వరి పంటలో ఎండాకు తెగులు

వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సందర్శన

కడియం, ఆగస్టు 17: ప్రస్తుతం వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశిస్తోందని గుర్తించినట్టు జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. కడియం ఆవ ప్రాంతంలో వరి పొలాలను ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో ద్వారకా దేవిలతో కలిసి వారిద్దరూ శనివారం సందర్శించారు. నరసింహారావు మాట్లాడుతూ వరి సాగు చేసే కొన్ని ప్రాంతాల్లో ఎండాకు తెగులు క్రిసెక్ దశ ఆశించినట్టు గుర్తించామని, రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. నాట్లు వేసిన నెల రోజులకు, కొన్ని సార్లు నెల రోజుల తరువాత కూడా వరిపంటను ఆశిస్తుందన్నారు. నారు మడిలో ఆకుల అంచుల నుంచి లోపల వైపునకు నీటి డాగు మచ్చలు మాదిరిగా ఏర్పడి క్రమేపీ పసుపురంగుకు మారతాయన్నారు. తెగులు ఉధృతి ఎక్కువైతే దుబ్బులో కొన్ని పిలకలు, దుబ్బు మొత్తం చనిపోతుందన్నారు. రైతులు ఈ లక్షణాలను కాండం కుళ్ళు, దుబ్బు కుళ్లు తెగులు అని పొరబడి శిలీంద్రనాశనులు పిచికారీ చేస్తారని, దాని వల్ల తెగులు నివారణ జరగక పోగా సాగు ఖర్చు పెరుగుతుందన్నారు.